


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 23-06-2022 సంపుటి: 03 సంచిక: 270 పేజీలు: 4 వెల: రూ 3-00


## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

మళ్లీ టాప్‌లో నిలిచిన అమ్మాయిలు

ఫలితాల్లో కృష్ణా జిల్లా ఫస్ట్..కడప లాస్ట్

25 నుంచి జులై 5 వరకు రీ కౌంటింగ్‌కు దరఖాస్తు

ఫలితాలు విడుదల చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ

అవసరమైతే డిఎస్సీ నిర్వహిస్తామని మంత్రి వెల్లడి



విజయవాడ,జూన్22( : ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మళ్లీ బాలికలే టాప్‌లో నిలిచారు. ఫలితాల్లో కృష్ణా జిల్లా ముందజంలో ఉండగా ఉమ్మడి కడప చివరిస్థానంలో ఉంది. బుధవారం మధ్యాహ్నం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఏపీ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను విడుదల చేసారు. అనంతరం మీడియాతో ఫలితాల గురించి మాట్లాడారు. ఫస్టియర్‌లో 2,41,591 మంది పాస్ కాగా, ఫస్టియర్‌లో 54 శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది. సెకండియర్ లో 2,58,449 మంది పాస్ కాగా, 61 ఉత్తీర్ణత శాతం రికార్డు అయ్యింది. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా ఉంది. ఉత్తీర్ణతలో కృష్ణా జిల్లా టాప్‌గా నిలిచిందని, రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం జూన్ 25వ తేదీ నుంచి జులై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. రికార్డు స్థాయిలో 28 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం గమనార్హం. మొత్తం 10.01 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. జవాబు పత్రాల మూల్యాంక నాన్ని వేగంగా, జాగ్రత్తగా పూర్తి చేశారు. మొదటి సంవత్సరంలో 54, రెండో సంవత్సరంలో 61 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని.. ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఉత్తీర్ణత శాతంలో ఉమ్మడి కృష్ణ జిల్లా తొలిస్థానంలో ఉండగా.. ఉమ్మడి కడప జిల్లా చివరిస్థానంలో నిలిచింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. ఈనెల 25 నుంచి జులై 5 వరకు రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆగస్టు 3 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి బొత్స వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలురు 49, బాలికలు 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలురు 59, బాలికలు 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా ఉమ్మడి కృష్ణ జిల్లాలో 75 శాతం మంది ఉత్తీర్ణత పొందారు. అత్యల్పంగా ఉమ్మడి కడప జిల్లాలో 55 శాతం మంది ఉత్తీర్ణత పొందారు.

## శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సీఎం జగన్



శ్రీకాకుళం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న శ్రీకాకుళం రానున్నారు. అమ్మఒడి పథకం మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే సీఎం చేపట్టనున్నా రు. ఇదే సందర్భంలో శ్రీకాకుళం?ఆమదాలవలస రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన కోసం ఏర్పాట్లు సమీక్షించేందుకు సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ మంగళవారం శ్రీకాకుళం వచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి కోడి రామ్మూర్తి స్టేడియం, ఆర్ట్స్ కళాశాల ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 27న సోమవారం ఉదయం 11 గంటల కు శ్రీకాకుళంలో బహిరంగ సభ జరగనుంది. ఈ కార్యక్రమానికి అమ్మ ఒడి లబ్ధిదారులు హాజరు కానున్నారు. మూడో విడత పంపిణీ కార్యక్రమం ఇక్కడి నుంచే జరుగుతుంది. అంతకుముందు ఆమదాలవలస?శ్రీకాకుళం రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అమ్మ ఒడి లబ్ధిదారులతో మమేకమవుతారు. తిత్లీ, వంశధార ప్రాజెక్టుకు అదనపు పరిహారం పొందుతున్న లబ్ధిదారులతో కూడా కాసేపు ముచ్చటిస్తారు. ఈ సందర్భంగా ఆ లబ్ధిదారులు సీఎంకు ధన్యవాదాలు తెలియజేయనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా కోడి రామ్మూర్తి స్టేడియంను పరిశీలించిన సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక తదితరులుసీఎం హాజరవుతున్న ఈ కార్యక్రమాలకు సంబంధించి, పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై తలశిల రఘురాం, ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక సమీక్షించారు. ముందు గా కోడి రామ్మూర్తి స్టేడియం, ఆర్ట్ కళాశాల మైదానం పరిశీలించారు. అనంతరం హెలీపాడ్ స్థలి, సీఎం పయనించే మార్గం, బహిరంగ సభ, లబ్ధిదారులతో ముఖాముఖీ తదితర వాటిపై చర్చించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ బంగ్లాకు చేరుకుని జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎం పర్యటనకు సంబంధించి పలు సూచన, సలహాలు చేశారు.కార్యక్రమంలో ధర్మా న రామ్ మనోహర్‌నాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డీఆర్‌డీఏ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్డీవో బి.శాంతి, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వడ్డి సుందర్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ కాంతిమతి, డీఈవో పగడాలమ్మ, సమగ్ర శిక్ష అభియాన్ పీఓ జయప్రకాష్, డీఎస్పీ మహేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు మెంటాడ స్వరూప్, జలుమూరు ఎంపీపీ వాన గోపి, శిమ్మ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నుంచే అమ్మ ఒడి మూడో విడత పంపిణీ

ఆమదాలవలస శ్రీకాకుళం రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులకు శంకుస్థాపన

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించిన ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం



## వాణిజ్య భవన్ ను ప్రారంభించనున్న పీఎం మోదీ



న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రిత్వ శాఖ నూతన భవనం 'వాణిజ్యభవన్' ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారం ప్రారంభించనున్నారు. ఉదయం జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా నేషనల్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్ పోర్ట్ రికార్డ్ ఫర్ ఈయర్లీఅనాలసిస్ ఆఫ్ ట్రేడ్(ఎన్ఐఆర్ వై ఏటీ) పోర్టల్ ను కూడా ప్రధాని ఆవిష్కరించనున్నట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పోర్టల్ ద్వారా స్టేక్ హోల్డర్స్ కు ఒక వేదికలా ఇది ఉపయోగ పడుతుందని తెలిపారు.భారతీయ విదేశీ వ్యాపారానికి సంబంధించి పూర్తి సమాచారం ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇండియా గేట్ సమీపంలో నిర్మించి వాణిజ్యభవన్ వినూత్నమైన ఆర్కిటెక్చర్ డిజైన్ తో నిర్మించారు.ప్రత్యేకించి విద్యుత్ ఆదాచేసే విధానాన్ని అనుసరించారు. వాణిజ్య ప్రమోషన్, పరిశ్రమలకు సంబంధించి ఒకే గొడుగు కింద నిర్వహించుకునేందుకు వాణిజ్యభవన్ ఉపయోగ పడుతుందని అధికారులు తెలిపారు.

### ప్రజాప్రతినిధుల కేసుల ఉపసంహరణపై ఏపీ హైకోర్టు సీరియస్

అమరావతి : ప్రజాప్రతినిధుల కేసుల ఉపసంహరణపై ఏపీ హైకోర్టు సీరియస్ అయ్యింది. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కేసుల ఉపసంహరణను సవాల్ చేస్తూ.. హైకోర్టులో ఏపీజేఎఫ్ అధ్యక్షుడు చెవులు కృష్ణాంజనేయులు పిటిషన్ వేశారు. న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ పిటిషన్‌పై వాదనలు వినిపించారు. పీపీతో సంబంధం లేకుండా డీజీపీ, కలెక్టర్ ఆదేశాలతో.. కేసులు ఎలా తొలగిస్తారని న్యాయవాది ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేసులు తొలగించాలంటే.. హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉందని శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. హైకోర్టు అనుమతి లేకుండా కేసులు ఎలా తొలగించారని



ధర్మాసనం ప్రశ్నించింది. ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఎన్ని కేసుల తొలగింపునకు హైకోర్టు అనుమతి తీసుకున్నారని ప్రశ్నించింది. ఎన్ని ఉపసంహరించారన్న దానిపై అఫిడవిట్ వేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఓటర్లకు డబ్బుల పంపిణీ, అధికారులపై దాడుల కేసులు కూడా.. తొలగించారని ధర్మాసనం దృష్టికి శ్రవణ్‌కుమార్ తీసుకొచ్చారు. ప్రభుత్వం అఫిడవిట్ వేయకుంటే కేసులో ఆదేశాలు ఇస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు విచారణను ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

## పేదల విద్యకు అడ్డంకులు వద్దు: మంత్రి ఆదిమూలపు సురేష్



తాడేపల్లి : పేదల విద్యకు అడ్డంకులు సృష్టించవద్దని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సూచించారు. పేద విద్యార్థులు చదువుకోవద్దనేది చంద్రబాబు లక్ష్యమని, వారి చదువులకు ఆయన ప్రధాన అడ్డంకిగా మారారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు తన హయాంలో ప్రభుత్వ స్కూళ్లను చలకనగా చూసి.. కార్పొరేట్ స్కూళ్లకు కొమ్ముకాయడం వల్లనే ఇప్పుడీ పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. నిరుపేద చిన్నారులకు నాణ్యమైన విద్యనందించేందుకు సీఎం జగన్ కృషి చేస్తుంటే.. టీడీపీ నేతలమో అడ్డంకులు సృష్టిస్తున్నారని విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.ధనవంతులకు అందుబాటులో ఉన్న 'ఎడ్యు టెక్'ను ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకూ అందించాలనే ఉద్దేశంతో బైజూస్‌తో ఒప్పందం చేసుకున్నట్లు మంత్రి సురేష్ చెప్పారు. ఇది ప్రభుత్వ విద్యలో ఒక గేమ్ చేంజర్ అని.. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్నిరకాల అవకాశాలు అందుబాటులోకి రావాలని సీఎం జగన్ నిత్యం పరితపిస్తుంటారని ఆయన చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం విద్యాను ప్రవేశపెట్టి నిరుపేద విద్యార్థులకు భవిష్యత్‌లో అంతర్జాతీయ అవకాశాలు వచ్చేలా చేస్తుండటం ఎంతో గర్వించదగినదని అన్నారు.ప్రస్తుతం బైజూస్ కంటెంట్ కొనాలంటే ఒక్కో విద్యార్థి రూ. 20-25 వేల వరకు ఖర్చవుతుందని, అలాంటిది అందరికీ అందుబాటులోకి వచ్చేలా చేయడం చాలా గొప్పవిషయమని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు వద్దని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు బైజూస్‌పైనా తన అక్కసును వెళ్లగక్కుతున్నారని మంత్రి సురేష్ దుయ్యబట్టారు.

## ఏపీ సీఎం మొండివైఖరి సరికాదు

: సీపీఐ జాతీయ కార్యదర్శి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానులంటూ ఏపీ సీఎం మొండివైఖరిని అవలంభిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం ఆరోపించారు. అమరావతే రాజధానిగా కొనసాగించాలంటూ తుళ్లూరులో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్? ఆధునిక తుగ్లక్?గా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.అమరావతిని రాజధానిగా నిర్మించే వరకు రైతుల పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు. ముఖ్యమంత్రి జగన్? ఇప్పటికైనా మనసు మార్చుకుని అమరావతిని నిర్మించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును కూడా ముఖ్యమంత్రి గౌరవించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు.

## 24 ఏళ్ల కల నెరవేర్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో 1998 డీఎస్సీ అభ్యర్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి, కృతజ్ఞతలు తెలియజేశారు. 24 ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించడం ద్వారా తమను, తమ కుటుంబాలను ఆదుకున్నారని ముఖ్యమంత్రి వద్ద అభ్యర్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ని సన్మానించారు. 1998 డీఎస్సీలో పలు కారణాల వల్ల ఉద్యోగాలు పొందలేకపోయిన వారికి పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో 1998 డీఎస్సీ అభ్యర్థులతోపాటు, ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ఉన్నారు.

## ముర్ముకు ముందస్తు శుభాకాంక్షలు

సోమువీర్రాజు

విజయవాడ భారత దేశ చరిత్ర లో తొలి సారిగా గిరిజన మహిళను రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికచేసి బీజేపీ చరిత్ర సృష్టించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. ×సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే మాటను అక్షర సత్యం చేసి చూపించిన ప్రధాని నరేంద్రమోదీకి,అమిత్ షా జీ, జెపి నడ్డా కి కృతజ్ఞతలు. ఈ వ్యవస్థ నడపడంలో అందరి పాత్ర ఉందని మరో మారు నిరూపించారు. బీజేపీకి మూడు సార్లు అవకాశం వస్తే, మొదటి సారి ముస్లిం కి, రెండవసారి దళితునికి,మూడవసారి గిరిజన మహిళకు అవకాశం కల్పించడం హర్షణీయం. ద్రౌపది ముర్ముకి ముందస్తు శుభాకాంక్షలని అన్నారు. .

# సంపాదకీయం

**గురువారం 23-06-2022**

## రాజకీయ పార్టీలపై వేటు

ఎన్నికల సమయంలో కొత్త కొత్త పార్టీలు పుట్టుకొస్తుంటాయి. కొన్ని నిజంగానే ప్రజల ఆదరణ పొంది నిలదొక్కుకుంటాయి. కొన్ని ఆ ఎన్నికల హడావుడి దాటగానే అంతగా కనపడవు, వారి నాయకుల మాటలేవీ వినపడవు. ఇలాంటి పార్టీలు వుండి ప్రజల్ని ఇబ్బందిపెడుతూంటాయి, సందిగ్ధంలో పడేస్తుంటాయి. దేశంలో ఇలాంటి పార్టీలు ఒకటీ రెండు కాదు ఏకంగా 111 రాజకీయ పార్టీలు వున్నాయని వాటిని తమ రిజిస్టర్‌నుంచి తొలగించేసినట్టు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ రాజకీయ పార్టీలు వెరిఫికేషన్‌లో అసలు వునికిలో లేవని తేలింది. రిజిస్టర్డ్ గుర్తింపులేని పార్టీల వెరిఫికేషన్, లేదా చిరునామాలు, కమ్యూనికేషన్‌ను ధృవీకరించడానికి అధికారులు జారీచేసిన లేఖల్లో వాటి వునికి లేనట్టు ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు నివేదించారు.ఆ తర్వాతనే ఇ.సి ఈ చర్యను తీసుకుంది. ఇంతకు ముందు వారు అలాంటి 87 ఉనికిలో లేని రాజకీయ పార్టీలను తొలగించారు. సాధారణ ఎన్నికల గుర్తు కేటాయింపుతో సహా చిహ్నాల ఆర్డర్ కింద ఈ పార్టీలకు కల్పించిన వివిధ ప్రయోజనా లను ఉపసంహరించుకోవాలని ఇ.సి నిర్ణయించింది. ఏదైనా నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీ ఉనికికి సంబంధించిన అన్ని ఆధారాలు, ఏడాది వారీగా వార్షిక ఆడిట్ చేసిన ఖాతాలు, కంట్రిబ్యూషన్ రిపోర్ట్, వ్యయ నివేదిక, సవరించిన జాబితాతో పాటు సంబంధిత రాష్ట్ర ఎన్ని కల ప్రధాన అధికారిని 30 రోజుల్లోగా సంప్రదించవచ్చని పోల్ ప్యానెల్ ఒక ప్రకటనలో తెలిపింది.తీవ్రమైన ఆర్థిక అవక తవక లకు పాల్పడిన మూడు పార్టీలపై అవసరమైన చట్టపరమైన, క్రిమినల్ చర్యల కోసం రెవెన్యూ శాఖకు సూచన కూడా పంపినట్లు ఈసీ తెలిపింది. 2017-18, 2018-19, 2019-20 సంవత్సరాల్లో తమ నివేదికలను సమర్పించని పార్టీల జాబితా సంబంధిత నిబంధనలతో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అన్ని పర్యవసాన చర్యల కోసం రెవెన్యూ శాఖతో భాగస్వామ్యం చేశారు. చట్టం ప్రకారం తప్పనిసరిగా కాంట్రిబ్యూషన్ రిపోర్టులను సమర్పించకుండా ఆదాయపు పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసిన 66 గుర్తింపు లేని రాజకీయ పార్టీల జాబితా కూడా రెవెన్యూ శాఖకు అందజేశారు.ఎన్నికల సంఘం మే 25 నాటి ఉత్తర్వులను ఉటంకిస్తూ, భారతదేశం అంతటా వివిధ పార్టీలు తమ ఆడిట్, కంట్రిబ్యూషన్ నివేదికలను సరిగ్గా సమర్పించకుండానే పన్ను మినహాయింపును పొందుతున్నాయని తేలింది. రాష్ట్ర సీఈవోల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించగా, అనేక పార్టీలు నిబంధనలు, చట్టాలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించి నట్లు అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌కు చెందిన అప్నా దేశ్ పార్టీకి ఇద్దరు వేర్వేరు వ్యక్తులు అధ్యక్షులుగా ఉన్నారని ఆ వర్గాలు తెలిపాయి. ఈ వివరాలను ఉటంకిస్తూ, పార్టీ అందుకున్న విరాళాల విధానాన్ని అందించడంలో విఫలమైందని వారు చెప్పారు. అదేవిధంగా, మహారాష్ట్రలోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ పార్టీ వరుసగా రెండేళ్ల బ్యాలెన్స్ షీట్లు సరిపోలడం లేదని వారు ఉదాహరణగా పేర్కొన్నారు.మహారాష్ట్ర సీఈవో వెబ్‌సైట్‌లో బంగారంపై పెట్టుబడులు పెడుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. భారతీయ రజనీతిక్ వికల్ప్ పార్టీకి రెండేళ్లలో సుమారు రూ. 28 కోట్ల విరాళాలు అందాయి. అయితే బీహార్ సీఈవో వెబ్‌సైట్‌లో వార్షిక ఆడిట్ ఖాతాలు అందు బాటులో లేవు. మధ్యప్రదేశ్‌లోని జన్ సంఘర్ష్ విరాట్ పార్టీ కోసం ఆడిటర్ ఎటువంటి వివరాలు లేకుండా ఆన్‌లైన్ లాభ, నష్ట ప్రకటనను ధృవీకరించారు. రూ. 2,000 అంతకంటే ఎక్కువ అనామక విరాళాలను నిషేధించాలని పోల్ ప్యానెల్ ప్రభుత్వాన్ని కోరుతోంది.

## 40 ఏళ్ల తర్వాత మళ్లీ... బ్యాక్ టూ యూత్

విజయవాడ, జూన్ 22, టీడీపీ ఆవిర్భవించినప్పుడు యూత్ లుక్ ఎక్కువ. తర్వాత యువతను ప్రోత్సహించిన సందర్భాలు అరుదే. తెలుగుదేశం ఆవిర్భవించిన 40 ఏళ్ల తర్వాత? రాబోయే ఎన్నికల్లో 40 శాతం మంది యువతకే ప్రాధాన్యం అన్నది ప్రస్తుతం చంద్రబాబు మాట. 2019 ఎన్నికల తర్వాత పార్టీకి గడ్డుకాలం నడుస్తోంది. దీనికితోడు ఇంఛార్జుల పేరుతోనో.. సీనియర్లు అనే హోదాలోనో చాలా మంది లీడర్లు ఎక్కడికక్కడ పాతుకుపోయారు. వారు పనిచేయరు.. మిగిలిన వారికి అవకాశం ఇవ్వరు అనే విమర్శలు పసుపు శిబిరంలోనే ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో 40 శాతం యువతకే అంటే 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 70 వరకు కొత్తవాళ్లకే ఛాన్స్ ఇవ్వాల్సి ఉంటుంది.ఈ యంగ్ థియరీని అమలు చేసే పరిస్థితిలో టీడీపీ ఉ ందా అనేది పార్టీ వర్గాల అనుమానం. ఈ మధ్య కాలంలో చంద్రబాబు పార్టీ కోఆర్డినేటర్లతో వరసగా సమావేశం అవుతున్నారు. వారికి అప్పగించిన నియోజకవర్గాల్లో కనీసం 40 శాతం కొత్త అభ్యర్థులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని.. యువతను గుర్తించి జాబితా సిద్ధం చేయాలని చంద్రబాబు చెబుతున్నారట. ఈ క్రమంలో సైలెంట్‌గా ఉన్న సీనియర్లు బయటకొస్తున్నారు. హడావిడి చేస్తున్నారు కూడా. ఇందుకు కొన్ని నియోజకవర్గాల్లో జరుగుతున్న వ్యవహారాలను పార్టీ వర్గాలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. ఆ మధ్య గుడివాడలో తనకు తప్ప టీడీపీకి వేరే ఆప్షన్ లేదని అనుకునేవారు రావి వెంకటేశ్వరరావు. కానీ.. అక్కడ శిష్టలా లోహిత్‌ను పార్టీ ప్రోత్సహిస్తుండటంతో రావి శిబిరంలో గుబులు మొదలైందట. ఇదే విధంగా గుంటూరు జిల్లాలోనూ చంద్రబాబు దృష్టి ఒక యువనేతపై పడిందట. దాంతో పెదకూరపాడులోని టీడీపీ నేతలు గుమ్మం దాటి బయటకొస్తున్నారట. అయితే వారిని పిలిచి చంద్రబాబు క్లాస్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు మూడు సెగ్మెంట్ల విషయంలోనూ ఇదే విధమైన చర్చ నడుస్తోంది.ఉ మ్మడి విశాఖ జిల్లాలోని చోడవరం, మాడుగుల, యలమంచిలి, భీమిలి నియోజకవర్గాల్లోనూ ఇదే విధమైన ఆసక్తి నెలకొంది. ఇక్కడ ఇంఛార్జులుగా సెకండ్ లీడర్‌షిప్పే ఉంది. వచ్చే ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తారు? గ్రౌండ్ లెవల్లో జరుగుతున్న చర్చ ఏంటి అనేదానిపై చర్చకు అధినేత ఆస్కారం ఇవ్వడం లేదు. యలమంచిలిలో గత ఎన్నికల్లో ఓడిన తర్వాత మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వైసీపీలో చేరిపోయారు. అక్కడ పప్పల చలపతిరావు ఉన్నప్పటికీ ప్రగడ నాగేశ్వరరావును ఇంఛార్జ్‌ను చేసింది టీడీపీ. చోడవరంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన రాజు అస్త్ర సన్యాసం చేయడంతో.. బత్తుల తాతయ్యబాబుకు నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు అప్పగించారు. ఇంతలో జిల్లా మహానాడు పేరుతో మాజీ ఎమ్మెల్యే రాజు తెరపైకి రావడంతో టీడీపీ శిబిరంలో చర్చ మొదలైంది. ఇక మాడుగులలో మూడు ముక్కలాట సాగుతోంది. భీమిలిలో ఇంఛార్జ్ కోరాడ రాజబాబుకు టికెట్ ఇస్తారో లేదో అని కేడర్‌కే అనుమానం ఉందట.అనకాపల్లిలో నిర్వహించిన సమీక్షల్లో ఇంఛార్జుల పేర్లు ప్రస్తావనకు వచ్చినప్పుడు అభిమానులు, కార్యకర్తలు చప్పట్లు కొట్టడం కనిపించింది. అభ్యర్థులను ఇప్పుడే తేల్చేస్తే.. క్షేత్రస్థాయిలో పనిచేసుకోవడానికి సాధ్యపడుతుందని కొందరు ప్రతిపాదించారట. అయితే మూడేళ్లుగా పత్తా లేని నాయకులు ఇప్పుడు బయటకు రావడం ఇంఛార్జులను కలవర పెడుతోందట. మొత్తానికి సీనియర్లను నొప్పించకుండా యువతకు ప్రాధాన్యం ఇవ్వడం చంద్రబాబుకు సవాలే అన్నది పార్టీ వర్గాల మాట. మూడేళ్లుగా బద్ధకంగా ఉన్న నేతలను రోడ్డెక్కించడానికి మాత్రం యూత్ థియరీ ఉపయోగపడిందని భావిస్తున్నారు. మరి.. ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్లను చంద్రబాబు ఏ విధంగా అధిగమిస్తారో చూడాలి.

## చంటిబాబు మెడకు సుబ్రహ్మణ్యం కేసు

కాకినాడ, జూన్ 22, గత నెల 19న డ్రైవర్ సుబ్రమణ్యం హత్య జరిగింది. ఆ తర్వాత నాలుగు రోజులకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్ చేశారు పోలీసులు. మధ్యలో ఆ నాలుగు రోజులపాటు ఎమ్మెల్సీ పెళ్లిళ్లు, పేరంటాలుకు తిరుగుతూ పెద్ద హంగామానే చేశారు. అరెస్ట్ తర్వాత అనంతబాబు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఆ సమయంలో ఎమ్మెల్సీ మాట్లాడిన కాల్స్ వ్యవహారంలో ఆసక్తికర చర్చ జరుగుతుంది. ఆ నాలుగు రోజుల్లో అనంతబాబు ఎక్కువగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో మాట్లాడారట.చంటిబాబు జగ్గంపేట నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009, 2014 ఎన్నికల్లో టీడీపీ తరుఫున పోటీ చేసి ఓడిపోయారు. 2014లో ఈ నియోజకవర్గం నుంచి జ్యోతుల నెహ్రూ వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీలో చేరారు. ఆ సమయంలో జగ్గంపేట టీడీపీ ఇంఛార్జ్‌గా ఉన్న చంటిబాబును వైసీపీలోకి తీసుకురావడంలో అనంతబాబు ఫుల్ సపోర్ట్ చేశారట. తర్వాత జరిగిన ఎన్నికల్లో చంటిబాబుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం.. ఆయన ఎమ్మెల్యే కావడం చకచకా జరిగిపోయింది. ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఉంది. చంటిబాబు.. నెహ్రూ.. అనంతబాబు ముగ్గురూ బంధువులే. నాడు రాజకీయంగా సపోర్ట్ చేయడం.. బంధువు కావడంతో అనంతబాబు కేసులో ఇరుక్కున్నప్పుడు చంటిబాబు యాక్టివ్ రోల్ పోషించినట్టు చెవులు కొరుక్కుంటున్నారు. అదేదో చిన్న కేసు అనుకుని తనస్థాయిలో చక్కబెట్టేద్దామని ఎమ్మెల్యే అభిప్రాయపడినట్టు టాక్. కానీ.. చివరకు చిరిగి చేట అవ్వడంతో కక్కలేక మింగలేక ఉన్నారట చంటిబాబు.కేసులో నుంచి ఎలా బయటకు రావొచ్చు.. అనపర్తి స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ఒక అధికారిని మధ్యలో ఉంచి మొత్తం క్లియర్ చేస్తానని అనంతబాబుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. దానికి తగ్గట్టుగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడటానికి పిక్చర్ ప్రిపేర్ చేశారట. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా ప్రభుత్వ పెద్దల వరకు వెళ్లడంతో.. అనవసర విషయాల్లో తలదూర్చొద్దని ఎమ్మెల్యేకు ఆదేశాలు వెళ్లాయట. దాంతో ఆ హెల్పింగ్ ఎపిసోడ్‌కు అక్కడితో బ్రేక్ పడినట్టు తెలుస్తోంది. అయితే కేసు విచారణలో భాగంగా పోలీసులు పిన్ టు పిన్ అన్ని విషయాలను పరిశీలిస్తున్నారు.

అందుకే అప్పట్లో జరిపిన ఫోన్ సంభాషణపై ఎమ్మెల్యే ఇప్పుడు బెంగ పెట్టుకున్నారట.హత్య కేసుతో సంబంధం లేకపోయినా.. ఆ సమయంలో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ప్లే చేయకుండా ఉండాల్సింది అని ఇప్పుడు బాధపడుతున్నారట ఎమ్మెల్యే. మరీ అడ్వాన్స్ అయిపోయామా అని ఆంతరంగికుల చర్చల్లో ఆరా తీస్తున్నారట. పరిధికి మించి ప్రవర్తించామా అని ఒక్కోసారి ఉలిక్కి పడుతున్నారట. భవిష్యత్‌లో విచారణకు పిలవరు కాదా అని ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. అసలే అక్షింతలు పడ్డాయి. ఇప్పుడు పిలిస్తే ఇంకా డ్యామేజ్ అవుతుందని టెన్షన్ పడుతున్నారట ఎమ్మెల్యే. ఏదో అనుకుంటే ఇంకేదో అయ్యిందని.. దారినపోయే కంపను తగిలించుకున్నామని ఆవేదన చెందుతున్నారట. ఈ విషయం తెలిసినప్పటి నుంచి జిల్లా వైసీపీ వర్గాల్లో ఏమ్మా చంటి..! ఏంటి సంగతి అని సెటర్లూ వేస్తున్నారట.

## పాపం.. 30 ఇయర్స్ ఇండస్ట్రీ

విజయవాడ, జూన్ 22, టాలీవుడ్ నటుడు, ఎస్వీబీసీ మాజీ చైర్మన్ పృథ్వీ రాజ్ గుర్తున్నారుగా? అవును, ఆ థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వి గురించే, మనం ఇప్పుడు మాట్లాడుకుంటోంది.2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన ఆయన, కొద్ది కాలం పాటు ఆ పార్టీలో ఓ వెలుగు వెలిగారు. అ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం,చాలాచాలా కష్ట పడ్డారు. జగన్మోహన్ రెడ్డిని వేనోళ్ళ పొగుడుతూ, ఉరూరా తిరిగారు. పార్టీ ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. పనిలో పనిగా, తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టార్గెట్' గా విమర్శలు గుప్పించారు. నోరుంది ఎందుకంటే, రాజకీయ ప్రత్యర్ధులను విమర్శించే అందుకే అన్నట్లు విరుచుకు పడ్డారు. ఆయన ప్రచారం పనిచేసిందో, రాష్ట్ర ప్రజల దురదృష్టమో కానీ, ఆ ఎన్నికలో వైసీపీ విజయం సాధించింది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సహజంగానే, పార్టీ కోసం అంతగా కష్టపడిన పృద్వీ' జగనన్న తనను అందలం ఎక్కిస్తారని ఆశపడ్డారు. అయితే ఆయన ఏమి ఆశ పడ్డారో, ఏమి ఆశించారో ఏమో కానీ, జగన్ రెడ్డి ఆయనకు మరీ మొండి చేయి చూపించకుండా, ఎస్వీబీసీ ఛైర్మన్ పదవితో సరిపెట్టారు.ఇక అక్కడి నుంచి పృద్వీ మరింతగా రెచ్చిపోయారు. ప్రతి పక్ష పార్టీల నాయకులను ఎంత పెద్దగాతిడితే, అంతగా ముఖ్యమంత్రి దృష్టిలో పడొచ్చని. మరో మెట్టు ఎక్కచ్చని అనుకున్నారో ఏమో కానీ, ఎస్వీబీసీ ఛైర్మన్ పదవిని అడ్డు పెట్టుకుని ప్రతిపక్షాలపై విమర్శలతో విరుచుకు పడ్డారు. చివరకు, అమరావతి రైతుల ఆందోళలోనూ వేలు పెట్టారు. సినిమా కూతలు కూశారు. అమరావతి రైతుల ఉద్యమంపై థర్టీ పృథ్వీ చేసిన డర్టీ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైయ్యాయి.అయినా అయన ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ప్రతిపక్షాలపై ఓ రేంజ్ లో విరుచుకుపడ్డారు. అయితే, పృద్వీ ఎస్వీబీసే వైభోగం మూడు నాళ్ళ ముచ్చటగా ముగిసి పోయింది. ఒక మహిళకు ఉద్యోగితో అసభ్యంగా మాట్లాడిన వాయిస్ రికార్డులు బయటకు రావటంతో ఎస్వీబీసీ ఛైర్మన్ బాధ్యతల నుండి తప్పించారు. ఇక అంతే, అక్కడి నుంచి థర్టీ ఇయర్స్' కు కష్టాలు మొదలయ్యాయి. ఒకసారి ఎస్వీబీసీ నుంచి గెంటేసిన తర్వాత, వైసీపీలో ఆయన్ని పట్టించుకున్నవారు లేరు. మరో వంక నడమంత్రపు సిరి శాశ్వతం నుకుని రెచ్చి పోయి వెనకా ముందు చూసుకోకుండా, చిందులేసిన పాపానికి ఆయన్ని ఇండస్ట్రీ కూడా వదిలేసింది. అదేదో ముతక సామెతలో చెప్పినట్లుగా, ఉన్నదీ పోయి, ఉంచుకున్నడీ పోయి, పృద్వీ రోడ్డున పడ్డారు. కొంచెం ఆలస్యంగానే అయినా, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీకి తత్త్వం బోధపడినట్లుంది. అప్పట్లోనే తనపై సొంత పార్టీ వాళ్లే కుట్రపన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు పృథ్వీ, ఇప్పుడు పక్క చూపులు చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ పంచన చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ గురించి ఆయన చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. గతంలో పవన్ కళ్యాణ్ రెండు చోట్లా ఓడిపోయారు., గెలవలేకపోయారని అంటున్నారని.. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండదు ... 2024 ఎన్నికలలో జనసేన 40కి పైగా స్థానలలో విజయం సాధిస్తుందని భవిష్యవాణి వినిపిస్తున్నారు. అయితే, గతంలో ఇదే పృద్వీ అందరి కంటే ఎక్కువగా పవన్ కళ్యాణ్ పైనే వ్యక్తిగత విమర్శలు గుప్పించారని, జనసేన నాయకులు గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో రాజకీయాల్లో ఇవ్వన్నీ మాములే ... ఒక పార్టీలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకత్వాన్ని సమర్ధించడంతో పాటు ప్రత్యర్ధి పార్టీలను విమర్శించక తప్పదని ,అందుకు మంత్రి రోజానే, నిదర్శనం అంటున్నారు.నిజమే, టీడీపలో ఉన్నప్పుడు రోజా .. జగన్ రెడ్డినే కాదు, వైఎస్'ను కూడా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టినా వీడియోలు ఇప్పటికీ వైరల్ అవుతూనే ఉన్నాయి. కానీ, ఇప్పుడు ఆమె జగన్ రెడ్డికి సొంత చెల్లెలు కంటే ఎక్కవ .. అయితే, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ స్టోరీ కొంచెం డిఫరెంట్ అంటున్నారు. ఇప్పటికైతే పృద్వీ కథ విషాదపు మలుపులో వుంది .. భవిష్యత్ ఎలా ఉంటుందో .. ఏమలుపు తిరుగుతుందో చూడవలసి ఉందని ఆయన సన్నిహితులు అంటున్నారు.

## రైతును రాజును చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్**

ధర్మపురి రైతును రాజును చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని నామాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ రైతులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాబోయే కాలంలో అధికారంలోకి వస్తుందని, బ్యాంకులలో రైతులు తీసుకున్న పంట రుణాలను 2 లక్షల వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెల రోజుల లోపు మాఫీ చేస్తుందని, రైతులకు ఒక సంవత్సరానికి గాను ఎకరాకు 15000/- రూ.లు రైతు బంధు ఇస్తామని, కౌలు రైతులకు కూడా ఎకరాకు 15000/- రూ.లు రైతు బంధు ఇస్తామని, భూమి లేని ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 12000/- రూ.లు ఇస్తామని, ఉపాధి హామీ కూలీలను వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని, రైతు కూలీలకు రైతు భీమా వర్తింప చేస్తామని అన్నారు.వరి ధాన్యానికి క్వింటాలుకు 2500/- రూ.లు, మొక్కజొన్నకు క్వింటాలుకు 2200/- రూ.లు,మిర్చికి 15000/- రూ.లు,పసుపుకు 12000/- రూ.లు,కందులకు 6700/- రూ.లు, జొన్నలకు 3050/- రూ.లు, ఎర్రజొన్నలు 3500/- రూ.లు, పత్తికి 6500/- రూ.లు, సోయాబీన్ కు 4400/- రూ.లు,చెరుకుకు 4000/- రూ.లు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారుఈ కార్యక్రమంలో పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, బతికపల్లి గ్రామ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చాట్ల విజయ భాస్కర్, కిసాన్ సెల్ అధ్యక్షడు పటేల్ సత్యనారాయణ రెడ్డి, సుంకరి రవి,, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం, అనిల్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ లు అంద్రే సత్యనారయణ రెడ్డి, రామడుగు లింగయ్య, దప్పు పోచయ్య, నాయకులు దప్పు నర్సయ్య, దండవేని రాజుమల్లు, సంకిటి శ్రీకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు వడ్లూరి ప్రవీణ్ కుమార్, బత్తిని చంద్ర శేఖర్, జీల రాకేష్, బొమ్మగాని జితేందర్ గౌడ్, జిలా తిరుపతి, కాంగ్రెస్ నాయకులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ తిక్కకు లెక్కేంటో...



ఒంగోలు, జూన్ 22, ణానికో మాట మాట్లాడేవారితో స్నేహం కష్టమే. పూటకో విధంగా వ్యవహరించేవారి దోస్తానా ప్రమాదకరమే! ఈ రెండు అంశాలూ ఇప్పుడు నప్పేది జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కే! కొన్ని రోజులుగా ఏపీ రాజకీయాలు ఆయన వ్యక్తం చేస్తున్న భిన్నాభిప్రాయా లతోనే ముడిపడ్డాయి. ఇంతకీ ఆయన మనసులో ఏముంది? పొత్తుల విషయంలో స్పష్టత లేని డైలాగులు ఎవరు రాసిస్తున్నారు వంటి పలు అనుమానాలు ఏపీలో అన్ని వర్గాలకూ, పార్టీలకూ వస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడమే జనసేన లక్ష్యమన్న పవన్.. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వబోమని అన్నారు. వైసీపీని ఓడించేందుకు పొత్తులకు సిద్ధమనే సంకేతం ఇచ్చారు. పవన్ వ్యాఖ్యలను స్వాగతిస్తూ టీడీపీ నేతలు మాట్లాడటం.. త్యాగాలకు సిద్ధమంటూ టిడిపి అధినేత చంద్రబాబు కామెంట్ చేయడం తో ఏపీలో పొత్తులు ఖాయమనే ప్రచారం సాగింది.ప్రస్తుతం ఏపీలో బీజేపీ- జనసేన మిత్రపక్షాలుగా ఉన్నాయి. వైసీపీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా వున్న జనసేన అందుకు ఏ పార్టీతో నైనా కలిసేందుకు రెడీ అన్నారు పవన్. అయితే పవన్ చంద్రబాబు దత్తపుత్రుడని వైసీపీ ఆరోపిస్తోంది. జనసేన నేతలు తమ అధినేతను సీఎంగా చేసేట్టయితే ఏ పార్టీతోనైనా ముందడుగు వేస్తామని అసలు సంగతి బయటపెట్టారు. ఎందుకంటే వేరెవరికో మద్దతునిచ్చి గెలిపించగల సత్తా వున్నప్పుడు పీఠం ఎక్కేందుకు అవకాశాలను లాక్కోవాలని తమకూ వుంటుందని వారి అభిప్రాయం. కానీ ఈ విషయంపై టిడీపీ మౌనం వహించింది.రాజకీయాల్లో ఎంతో అనుభవం వున్న వ్యక్తి, ముఖ్యమంత్రిగా చేసి జనాదరణ పొందిన చంద్రబాబు ఈ పర్యాయం ఘన విజయం సాధించి సీఎం అవుతారన్న మాట అంతటా వినపడుతు న్నపుడు పవర్ స్టార్ వీరాభిమానులు, ఆయన పార్టీవారి మాటను పట్టుకుని చేతులు కలుపుతారని ఎవ్వరూ అనుకోరు. కాబోతే జనసేనతో పొత్తు ఆశిస్తున్న టీడీపీ కి జనసేన అధినేత పొత్తు ఈసారి కుదరకపోవచ్చునని అనడం ఓట్ల చీలికకే ఆయన అడుగులు అన్నది అర్థమ యింది. మరోసారి వైసీపీకి ఛాన్స్ ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని పవన్ అన్నారు. గత పాలకులను చూసిన ప్రజలు జన సేనకు ఒకసారి అధికారం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారని పవన్ వ్యాఖ్యానిం చారు. ప్రస్తుతం పొత్తులపై మాట్లాడబోనన్న జన సేన చీఫ్ తన పొత్తులు జనంతోనే ఉంటాయన్నారు. గతంలో వైసీపీని ఓడిం చేందుకు విపక్షాలు ఏకం కావాలనే సంకేతం ఇచ్చిన పవన్.. ఇప్పుడు మాత్రం ప్రజలతోనే పొత్తు ఉంటుందని చెప్పడం చర్చగా మారింది. అంతేకాదు జనసేనకు అధికారం ఇవ్వాలని జనాలు కోరుకుంటున్నారంటూ పరోక్షంగా తానే సీఎం అభ్యర్థిని అనడం కాస్తంత హాస్యపూరితమయిన మాట! మరోవైపు పొత్తు విషయంలో టీడీపీ త్యాగం చేయాల్సి ఉంటం దన్న పవన్ వ్యాఖ్యలపై టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి సెటైర్లు వేశారు. ఇది కూడా పవన్ యూటర్న్ తీసుకోవ డానికి కారణమనే ప్రచారం సాగుతోంది. ఈ విధంగా పూటకో మాటను ఏదో ఆదేశిస్తున్నట్టు అనడం, ఎవరిచేతనయినా అనిపిం చడం వల్ల స్నేహం చేద్దామని దగ్గరికి వచ్చే వారికంటే జనసేన నేతకే నష్టం. పాపం ఆయనకు ఈ సంగతి ఎవరు చెప్పుతారో!

## సింహగిరికి 4 కిలో మీటర్ల సెక్యూరిటీ

విశాఖపట్టణం, జూన్ 22, సింహగిరికి రక్షణ కవచం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వన్యప్రాణులు, ఔషధ మొక్కల సంరక్షణతో పాటు ఆక్రమణల నుంచి కాపాడేందుకు ఈ బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టి?టంది. ప్రహరీ నిర్మాణ బాధ్యతలను వీఎంఆర్‌డీఏకు అప్పగించగా.. తొలివిడతలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.3.59 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. ఔషధమొక్కలు, వన్యప్రాణుల సంరక్షణకు ఉపయుక్తం జీవవైవిధ్యానికి, పర్యావరణానికి చిరునామా సింహాచలం కొండలు. తూర్పు కనుమల్లో అత్యంత సుందరమైన, పర్యావరణహితమైన గిరులుగా పేరొందాయి. సింహగిరుల్లో 70 రకాల వృక్షజాతులు, 200 రకాలైన ఔషధమొక్కల జాతులున్నట్లు గుర్తించారు. అదేవిధంగా వందలాది రకాల వన్యప్రాణులు ఈ కొండలపై ఉన్నాయి. అయితే సింహాచలం కొండలు గతంలో ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో కొందరు ఆకతాయిలు కొండలపై నిప్పు పెట్టడంతో పలు ఔషధ మొక్కలు అగ్నికి ఆహుతవ్వగా వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి. వీటన్నింటి నుంచి సింహగిరులను సంరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సింహగిరి కొండల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టేందుకు అడుగులు వేస్తోంది. తొలి విడతలో 4.15 కి.మీ నిర్మాణానికి టెండర్లు సింహగిరిపై మొత్తం 4.15 కిలోమీటర్ల పొడవున్న రక్షణ గోడ నిర్మాణానికి రూ.3.59 కోట్లతో విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) టెండర్లు ఆహ్వానించింది. ఫేజ్?1, ఫేజ్?2గా విభజించి ఈ నిర్మాణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. చినగదిలి నుంచి జ్ఞానానంద ఆశ్రమం వరకూ 2.924 కిలోమీటర్లు, దుర్గానగర్ నుంచి పోర్ట్‌క్వార్టర్స్ హిల్స్ వరకూ 1.225 కి.మీ మేర ప్రహరీ నిర్మించనుంది. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 28 వరకు టెండర్లు దాఖలు చేసేందుకు గడువు విధించామనీ, 30వ తేదీన టెండర్లు పరిశీలన నిర్వహిస్తామని వీఎంఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణ సదస్సు

విశాఖపట్నం ఆదివాసి హక్కుల పరిరక్షణ పేరుతో విశాఖ వేదికగా సదస్సు జరిగింది.విశాఖ నగరంలోని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దళిత ఆదివాసీ సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉ త్తరాంధ్ర జిల్లాల నుండి దళిత సంఘాలు, ప్రజా సంఘా లు, ఉద్యోగ సంఘాలు పార్టీ రాజకీయ నాయకులు ఈ రౌండ్ టేబుల్ సమా వేశంలో పాల్గొని దళితులకు జరుగు తున్న అన్యాయం పై గళం విప్పారు. దళిత నేతలు పార్టీ పాతేటిపెంటారావు పతివాడ రాంబాబు, నాని,పుచ్చ కామే శ్వరరావు, ఉదయ భాస్కర్ నేతృత్వం లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కొండ్రు మురళి తో పాటు గా పలువురు దళిత నేతలు హాజరయ్యారు.

# నాటు కోడితో సూపర్ ఆదాయం

ఒంగోలు, జూన్ 22, డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పెరటి కోళ్ల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లోని స్వయం సహాయక గ్రూపుల్లో ఆసక్తి చూపే మహిళలకు రూ.4800 విలువ చేసే పెరటి కోళ్ల యూనిట్‌ను వడ్డీ లేని రుణం కింద అందించనుంది. ఒక్కో యూనిట్ కింద 9 కోడి పెట్టలు, 3 కోడిపుంజులు, వాటి పెంపకానికి అవసరమైన 30 కేజీల దాణాను మొత్తం కలిపి కూడా రూ.4800కే అందిస్తోంది. 9 కోడిపెట్టలు వరుసగా 100 గుడ్లు వరకు పెడుతుంది. రెండేళ్ల తర్వాత ఒక్కో కోడి కనీసం 2 కేజీల మాంసం అందిస్తుందిఈ విధంగా 12 కోళ్ల ద్వారా 24 కేజీల మాంసం వస్తుంది. నాటుకోడి కేజీ మాంసం ధర రూ.400 పలుకుతుందని అధికారుల అంచనా. ఇలా 24 కేజీల నుంచి రూ.9,600 ఆదాయం వస్తుంది. అలాగే కోడిగుడ్లు, మాంసంతో కలిపి రెండేళ్లలో కనీసం రూ.12 వేల ఆదాయం లభిస్తుంది. వచ్చిన ఆదాయంలో వైఎస్సార్ క్రాంతి పథం గ్రూపులకు 24 లేక 36 వాయిదాలలో వడ్డీ లేకుండా రుణం కింద ఇచ్చిన రూ.4800ను నెల నెలా చెల్లించగా, ఇంకా దాదాపు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు లాభసాటిగా ఉంటుంది. డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్ల పెంపకం ద్వారా అందించే నాటుకోళ్లను అనంతపురంలోనున్న ఎస్సెల్ బ్రీడ్ కంపెనీ వారి ద్వారా దిగుమతి చేస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి కనీసం 10 వేల యూనిట్లను



అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో పెరటి కోళ్ల పెంపకంతో పాటు పొట్టేళ్లు, మేకలను కూడా ఒక్కో కుటుంబానికి ఒక యూనిట్‌ను అందించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని పీడీ తెలిపారు. జిల్లాలో డీఆర్‌డీఏ సంస్థ ద్వారా వైఎస్సార్ క్రాంతి పథకం నుంచి గ్రామాల్లోని స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళల జీవనోపాధి కోసం ఇప్పటికే పలు పథకాల ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తూ వారి జీవనోపాధిని పెంచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. దానికోసం డీఆర్‌డీఏలో ఉన్న సుమారు రూ.200 కోట్ల రివాల్వింగ్ ఫండ్ ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తోంది. దానిలో భాగంగా స్త్రీనిధి, ఉన్నతి (ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్), సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్), హెచ్‌డీఐఎఫ్ (హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్) పథకాలను అందిస్తోంది. స్త్రీనిధితో స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు వ్యక్తిగతంగా ఒక లక్ష రూపాయల వరకు జీవనోపాధి పెంపునకు అందిస్తుంది. వాటి ద్వారా గొర్రెలు, గేదెలను పెంచుకోవచ్చు. ఉన్నతి పథకం కేవలం ఎస్సీ, ఎస్టీ మహిళలకు మాత్రమే సబ్‌ప్లాన్ పథకం నుంచి అందిస్తారు. ఈ పథకం ద్వారా గరిష్టంగా ఒక్కో వ్యక్తికి రూ.50 వేల వరకు రుణ సదుపాయం వడ్డీలేకుండానే అందిస్తారు. సీఐఎఫ్ పథకం ద్వారా గరిష్టంగా రూ.50 వేలను ఇస్తారు. అయితే ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కేటాయించాల్సి ఉంటుంది.

హెచ్‌డీఐఎఫ్ ద్వారా గరిష్టంగా రూ.50 వేలను హెల్త్ యాక్టివిటీ కింద ముందుగానే ఎంపిక చేసిన 15 మండలాల్లో మాత్రమే అందిస్తున్నారు. వాటితో పాటు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ తోడు వంటి పథకాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలోని 38 మండలాల్లో రానున్న ఏడాది లోపు 10 వేల యూనిట్లను పంపిణీ చేసేందుకు వైఎస్సార్ క్రాంతిపథం సిద్ధమవుతోంది. మొదటి విడతగా 4 వేల యూనిట్లను ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పూర్తి చేయాలని కంకణం కట్టుకుంది. దానిలో భాగంగా ఇప్పటికే చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, వెలిగండ్ల, హనుమంతునిపాడు, కనిగిరి మండలాల్లో దాదాపు 600 యూనిట్లకు పైగా పంపిణీ చేశారు

# వైసీపీకి షాక్

**-రాష్ట్ర కార్యదర్శి రుద్రరాజు వెంకట రామరాజు రాజీనామా**

**- వెంకటరామరాజుతో పాటు వైసీపీకి గుడ్ బై చెప్పిన 1000 మంది కార్యకర్తలు**

రాజోలు రాజోలు నియోజకవర్గ వైసీపీలో ముసలం చెలరేగింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రుద్రరాజు వెంకటరామరాజు పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు 1000 మంది కార్యకర్తలు పార్టీకి గుడ్ బై చెప్పారు. బుధవారం నాడు సఖినేటిపల్లి మండలం గుడిమూలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటరామరాజు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ మూడేళ్ల పాలన పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజోలు నియోజకవర్గంలో గత ఎన్నికలలో వైసీపీ కోసం కష్టించి పని చేసిన నాయకులు, కార్యకర్తలను పార్టీ అధిష్టానం విస్మరించడంపై నిరసన తెలిపారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల అసంతృప్తిని వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్ళినా పట్టించుకోలేదని తెలిపారు. జనసేన నుండి వచ్చిన వారి పెత్తనం వైసీపీ కేడరుపై పెరిగిందని అన్నారు. వైసీపీ అధిష్టానం తీరు నచ్చక ఈ రాజీనామా నిర్ణయం తీసుకున్నామని వెంకటరామరాజు ప్రకటించారు. భవిష్యత్ కార్యాచరణపై మీడియా ప్రతినిధుల ప్రశ్నకు స్పందిస్తూ తెలుగుదేశం పార్టీ నుండి ఆహ్వానం అందిందని, కార్యకర్తలతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వెంకటరామరాజుతో పాటు గుడిమూల మాజీ సర్పంచ్ కందుల సూరిబాబు, పొన్నమండ మాజీ సర్పంచ్ ఉండ్రు అమ్మాజీ సత్యనారాయణ రెడ్డి, ములికిపల్లి మాజీ సర్పంచ్ తాడి సత్యనారాయణ, కడలి మాజీ సర్పంచ్ వడ్డి సత్యం, టేకిశెట్టిపాలెం గ్రామ వైసీపీ అధ్యక్షులు పోతు ముత్యాలరావు (ఏసు), వైసిపి బిసి సెల్ గుడిమూల శాఖ అధ్యక్షులు గుబ్బల ఈశ్వరరావు, వైసీపీ జిల్లా కమిటీ సభ్యులు వలవల పృధ్వీసింగ్, చెన్నడం మాజీ సర్పంచ్ మట్టా ఈశ్వర బాలప్రసాద్ (అబ్బీస్), కూనవరం మాజీ సర్పంచ్ కలిగితి వెంకటేశ్వర రావు తదితరులు వైసీపీకి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

# ఏపీలో స్కూల్స్ వాయిదా

విజయవాడ, జూన్ 22, ఏపీలో స్కూల్ విద్యార్థులకు అలెర్ట్. రాష్ట్రంలో పాఠశాలల పునః ప్రారంభాన్ని జగన్ సర్కార్ వాయిదా వేసింది. వేసవి సెలవుల అనంతరం జూలై 4న తెరుచుకుంటాయని తొలుత ప్రకటించారు. అయితే తాజాగా స్కూల్స్ జూలై 5 న తిరిగి ప్రారంభం అవుతాయని ప్రభుత్వం వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖకు సూచనలు వెళ్లాయి. ఆజాదీకా అమృత్ మహోత్సవ్?లో భాగంగా స్వాతంత్ర్య విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి అర్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటనకు వస్తుండటంతో పాఠశాలల రీ-ఓపెన్ డేట్‌ని వాయిదా వేయాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో పాఠశాలలన్నీ జూలై 5న తెరుచుకోనున్నాయి. ప్రతి ఏడాది జూన్‌లో విద్యాసంస్థలను ప్రారంభించడం ఆనవాయితీ. ఐతే 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షల నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియలు కొంత ఆలస్యంగా జరిగినందున 2022-23 విద్యా సంవత్సరం ఆలస్యంగా ప్రారంభం అవ్వనుంది. కాగా వచ్చే నెల 4న ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తున్నారు. విశాఖ, భీమవరం, గుంటూరు జిల్లాలలో ప్రధాని టూర్ ఉండనుంది. తొలుత విశాఖలో జరిగే బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. అనంతరం భీమవరంలో అల్లూరి సీతారామరాజు 125 జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. అంతేకాకుండా మంగళగిరిలోని ఎయిమ్స్ ప్రారంభోత్సవంలోనూ ప్రధాని పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నాయకత్వం తెలిపింది.

# న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



**కాకినాడలో న్యాయవాదిపై దాడిచేసిన నిందితుడిని శిక్షించాలి**

**రాజమహేంద్రవరంలో న్యాయవాదుల నిరసన**

రాజమహేంద్రవరం దేశ వ్యాప్తంగా ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు, క్రూరమైన హత్యలు చోటుచేసుకుంటున్నాయని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ ముప్పాళ్ళ సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేసారు. కాకినాడలో న్యాయవాది కాలా నాగేశ్వరరావుపై ప్రో నోట్ కేసులో రికవరీ కోసం అరెస్టు వారెంట్ తేవడంతో ప్రత్యర్ధి క్లయింట్ అయిన మెండు శ్రీను అనే వ్యక్తి రేడియం బ్లేడ్తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని, తృటిలో అతడికి ప్రాణాపాయం తప్పిందన్నారు. న్యాయవాదిపై ఈ హత్యాయత్నాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ విధులు బహిష్కరించనట్టు తెలిపారు. జరిగిన ఘటనను నిరసిస్తూ రాజమహేంద్రవరం జిల్లా కోర్టు వ ద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి కోర్టు విధులకు హాజరు కాకుండా తమ నిరసన తెలిపారు. న్యాయవాదులపై వరుసగా జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిగణనలోకి తీసుకుని న్యాయవాదుల రక్షణ చట్టం తేవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహా దాడులు జరిగితే మాత్రం న్యాయవాదులకు కూడా ఆయుధాలు ఇవ్వాలని అడిగే పరిస్థితి ఖచ్చితంగా ఎదురవుతుందన్నారు ఈ సందర్భంగా ముప్పాళ్ల సుబ్బారావుతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యిళ్ల శివ ప్రసాద్, కార్యదర్శి పి.వి.వి.నాగరాజు , సీనియర్ కమిటీ సభ్యులు తవ్వాల వీరేంద్రనాద్ , దోకల అప్పారావు తదితరులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టి అమల్లోకి తేవాలని డిమాండ్ చేసారు. న్యాయవాది కార్యాలయంలోకి ప్రవేశించి మరీ దాడులకు తెగపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ దాడిలో అతడి చెవి, బుగ్గపై తీవ్రంగా గాయాలయ్యాయన్నారు. రక్తమోడుతున్న అతడిని స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చేర్చడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ నిర్వహించి నిందితుడికి అరెస్టు చేయడంతో పాటు తక్షణం శిక్ష పడేలా చేయాలని కోరారు. తీర్పులు చెప్పే న్యాయమూర్తులు, కేసులు వాదించే న్యాయవాదులకు రక్షణ లేకపోతే నిష్పక్షపాతంగా విచారణలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు.. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తమ్మారెడ్డి పాణిగ్రాహి,కోశాధికారి కె.ఎన్.వి.బాబు, పులగం రామలింగారెడ్డి, లక్ష్మణ్, కొండేటి రాణి, గొల్లపల్లి శ్రీనివాస్, సునీల్ లయోనిల్,బట్టు సునీల్, దాసరి అమ్ములు, సాకా సురేష్, , రామకృష్ణ, కాశీ శ్రీనివాసరావు, నామా సత్యనారాయణ, టి.రాజారత్నం, ధర్నాలకోట వెంకటేశ్వరరావు , రఘు, హస్సన్ ,తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో సందడి చేసిన 'శ్రీమతి శ్రీనివాస్' బృందం



విజయవాడ జూన్ 22 తాను మనస్ఫూర్తిగా ప్రేమించిన ఓ అమ్మాయిని తనదాన్ని చేసుకోవడం కోసం తన గుర్తింపును సైతం దాచిన ఓ యువకుడు, వివాహమైన తరువాత ఎదుర్కొనే సంఘటనల సమాహారంతో రూపొందించబడిన సీరియల్ 'శ్రీమతి శ్రీనివాస్'. స్టార్ మా తో పాటుగా డిస్నీ+హాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న ఈ సీరియల్‌కు అశేష తెలుగు ప్రేక్షకులు నీరాజనం పడుతున్నారు. అసలైన ప్రేమకు నిర్వచనం చెప్పే రీతిలో సాగుతున్న ఈ సీరియల్‌లోని ముఖ్య పాత్రలు శ్రీనివాస్, శ్రీదేవీలను అక్కున చేర్చుకున్నారు. తమను ఎంతగానో ఆదరిస్తోన్న ప్రేక్షకులను వ్యక్తిగతంగా కలుసుకోవడంతో పాటుగా నూతన జీవితంలోకి ప్రవేశిస్తున్న యువతీయువకులకు అభినందనలు తెలుపడంలో భాగంగా 'శ్రీమతి శ్రీనివాస్' బృందం ప్రత్యేకంగా పర్యటనలూ చేస్తోంది. ఇందులో బాగంగా రాజమండ్రి నగరంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైంది 'శ్రీమతి శ్రీనివాస్' సీరియల్ బృందం. వధూవరులకు పట్టు వస్త్రాలను అందించి అభినందనలు తెలిపిన ఈ బృందం, వివాహ వేడుకలో సందడి చేసింది. వివాహ వేడుకలలో నూతనోత్తేజం తీసుకువస్తూ, హాజరైన అతిథులతో సెల్ఫీలనూ దిగింది. ప్రేమ ఉన్న చోట బంధం మరింత బలపడుతుందన్న శ్రీమతి శ్రీనివాస్ బృందం ఆ ప్రేమసాగరంలో మునిగితేలాలని వధూవరులకు ఉద్బోధించారు.

# గడప గడపలో నీళ్ల సమస్యలు

**ఎమ్మెల్యే మద్దిశెట్టికి బోధనం పాడు గ్రామ ప్రజలు వినతి....**

**వైసీపీ పార్టీ కండువాలు లేకుండా గడప గడప లో కార్యకర్తలు, ఎమ్మెల్యే....**

ప్రకాశం కురిచేడు మండలం బోదనంపాడు గ్రామంలో దర్శి ఎమ్మెల్యే గడప గడప కార్యక్రమంలో ఏ గడప కాని గ్రామంలోని నీళ్ల సమస్యల గురించి ప్రజల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరముల క్రితం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కురిచేడు కాలవ నుండి ఎన్ ఎస్పి అగ్రహారం, బోదనంపాడు గ్రామాలకు నీళ్లు వచ్చే విధంగా జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపడతామని అప్పటి ఎన్నికలలో బోదనంపాడు గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే మాట ఇచ్చి గ్రామ ప్రజల చేత ఓట్లు వేయించుకొని నియోజకవర్గం లోనే గతంలో ఎన్నడూ లేని 40 వేలకు పైగా మెజారిటీతో గెలుపొందడం జరిగింది. కానీ ఇప్పటికీ జగనన్న ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు గడిచినప్పటికీ గ్రామంలో నీటి సమస్య సమస్యగానే ఉండటంతో ప్రతి గడప లో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ను నీళ్ల సమస్య గురించి ప్రజలు ప్రశ్నిస్తుండటంతో త్వరలో గుండ్లకమ్మ నుండి నీళ్లు వచ్చే విధంగా చర్యలు చేపడతామని ప్రజలకు తెలియజేశారు. గడప గడప లో తిరుగుతున్న వైసీపీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పార్టీ కార్యకర్తలు వైసిపి కండువాలు మెడలో లేకుండా పాల్గొనడం హాస్యాస్పదంగా ఉందని ప్రజలు గుసగుసలాడు తున్నారు. గడప గడప లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు వైసిపీ పార్టీ కండువా గ్రామ సర్పంచ్ వేమా శివ మెడలో వేసినప్పటికీ దానిని తీసి వేయడం కొస మెరుపు ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ నుసుం నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ వేమా శివ, మండల వైసిపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# శభాష్ పురం గ్రామంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు

**విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీదేవి**

**ఘనంగా స్వాగతం పలికిన వైసీపీ నాయకులు**

తుగ్గలి తుగ్గలి మండల పరిధిలోని గల శభాష్ పురం గ్రామ సమీపంలో కొండ పై వెలిసిన బూజుగుండ్ల రంగస్వామి కొండపై సకల దేవతల విగ్రహ ప్రతిష్ట వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రతిష్ట వేడుకలను వేదపండితులు సకల దేవతా పూజలు నిర్వహించి ఘనంగా ప్రతిష్టించారు. శివపార్వతుల,ఆంజనేయ స్వామి,కాశి రెడ్డి నాయన,నాగదేవత మరియు నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం రోజున విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి కళశాలకు పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రంగస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు మాజీ సర్పంచ్ హనుమంతు,ఎంపిటిసి,సర్పంచ్ మరియు వైసీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతిష్ట వేడుకలలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భోజనం మరియు నీటి వసతి సౌకర్యాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. భక్తులందరూ విగ్రహ ప్రతిష్ట వేడుకలలో పాల్గొని రంగ స్వామిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేష్, జడ్పిటిసి పులికొండ నాయక్,వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప,అట్లా బసిరెడ్డి,రాతన మోహన్ రెడ్డి, రాఘవ రెడ్డి, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్గనిస్థాన్ లో భూకంపం

కాబూల్ జూన్ 22, భారీ భూకంపం వచ్చిదంటే చాలు ఇళ్లన్నీ నేలమట్టమావడమే కాకుండా భారీ ఆస్తినష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా సంభవిస్తుంటుంది. మన దేశంలో కంటే విదేశాల్లో వచ్చే భూకంపాలు చాలా తీవ్రంగా ఉంటాయి. పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుంటుంది. ఇక తాజాగా ఆఫ్ఘనిస్తాన్‌ను భారీ భూకంపం వణికించింది. భూకంప తీవ్రత 6.1గా నమోదయ్యింది. ఈ భూకంపం ధాటికి సుమారు 255 మంది చనిపోయినట్టు అధికారులు ప్రకటించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. చాలా మందికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. పాకిస్తాన్‌లో భూప్రకంపనలు వచ్చాయి. భూకంపం కారణంగా భారీ ఆస్తినష్టం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వాళ్లను కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ రోజు సంభవించిన ఈ భూకంపం వల్ల ప్రజలు తవ్ర భయాందోళనకు గురయ్యారు. పెద్ద పెద్ శబ్దాలతో భూమి కంపించడంతో ఏమైందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు పెట్టారు.

# ఘనంగా దేవినేని నెహ్రూ జయంతి

విజయవాడ మాజీమంత్రి దేవినేని నెహ్రూ జయంతి సందర్భంగా ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద ఆయన విగ్రహానికి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్, రాష్ట్ర నాయకులు కడియాల బుచ్చిబాబు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ,ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత వందలాది మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ నెహ్రూ జయంతి సందర్భంగా అనేక ప్రాంతాలలో ఆయన అభిమానులు నెహ్రూ గారికి ఘనంగా నివాళు లర్పిస్తున్నారు. ఎంఎల్ఏ, మంత్రిగా నెహ్రూ గారు పేదలకు ఎన్నో సేవలు చేసారు. దేవినేని నెహ్రూ ఒక వ్యక్తిగా కాకుండా ఒక వ్యవస్థగా ఉన్నారు. మాటిచ్చారంటే ఆ మాట నిలబెట్టుకునే విధంగా పనిచేసే వ్యక్తి దేవినేని నెహ్రూ. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళతాం. గడప గడపకు కార్యక్రమంలో మూడు నెలలుగా తిరుగుతున్నాం. పేద ప్రజలకు ఎన్టీఆర్, వైఎస్ఆర్ తరువాత సంక్షేమ కార్యక్రమాలు చేసింది సీఎం జగన్ మాత్రమే. తూర్పు నియోజకవర్గం అభివృద్ధి మీద జగన్ ప్రత్యేక దృష్టి పెట్టి నాకు అప్పజెప్పారు. గతంలో తూర్పు నియోజకవర్గంలో వైసీపీ ఓడిపోయింది. వైసీపీ ఓడిపోయిన నియోజకవర్గ లలో కూడా కోట్లాది రూపాయల తో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు నుంచి విశేష స్పందన వస్తోందని అన్నారు. వైసీపీ నేత కడియాల బుచ్చిబాబు మాట్లాడుతూ నెహ్రూ జిల్లా వ్యాప్తంగా పేద ప్రజలకు అండగా నిలిచారు. ప్రతీ పేదవాడికి అందుబాటులో ఉంటూ దేవినేని నెహ్రూ గారి పేరు నిలబెడుతున్నారు అవినాష్ . రాబోయే రోజుల్లో తూర్పు నియోజకవర్గంలో అవినాష్ ను గెలిపిస్తారని కోరుతున్నాం. జగన్ పాలన పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారు. సంక్షేమ పథకాలు ని ప్రజలకు మరింత చేరువ చేస్తామని అన్నారు.

# భూగర్భ డ్రైనేజి వ్యవస్థపై పూర్తి అవగాహన కల్గి వుండాలి

**- కమిషనర్ అనుపమ అంజలి**

తిరుపతి భూగర్భ డ్రైనేజి వ్యవస్థపై అధికారులు, పారిశుధ్య కార్మికులు పూర్తి అవగాహన కల్గి వుండాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని లలిత కళా ప్రాంగణంలో భూగర్భ డ్రైనేజి పారిశుధ్య కార్మికులకు, సచివాలయ అమినిటి సెక్రటరీలకు భూగర్భ డ్రైనేజి వ్యవస్థ గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహనపై మూడు రోజులు పాటు వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్ లో మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డిఈలు చంద్రశేఖర్ రెడ్డి, రవింద్రరెడ్డి, సంజయ్ కుమార్, దేవికలు పాల్గొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించగా, స్వచ్చ సర్వేక్షన్ కో ఆర్డినేటర్ మస్తాన్ డెమో నిర్వహించి, కార్మికులకు అర్ధమయ్యేలా వివరించారు. ఏదైన భూగర్భ డ్రైనేజిలో సమస్య వస్తే, ఆ ప్రదేశాన్ని గుర్తించిన కార్మికులు ముందుగా ఆ సమాచారాన్ని అమినిటి సెక్రటరీలకు, ఏఈ, డిఈకు చెప్పాలని, వారి సూచనల మేరకే క్లినింగ్ ప్రక్రియకు వెల్లాలన్నారు. భూగర్భ డ్రైనేజీ రిపేర్లకు మిషనరీలనే వాడాలని, తప్పని పరిస్థిల్లో మనుషులతో పని చేయించాలంటె, పైస్థాయి అధికారులను సంప్రదించి, పిపి కిట్లను, ఆక్సిజన్ సిలిండర్ వున్న గ్యాస్ మాస్కులు ధరించాలని, మ్యాన్ హోల్లో ఆక్సిజన్ శాతం ఎంతుందో ఆక్సిజన్ మానిటర్ మిషనతో పరిక్షించిన తరువాతే దిగాలన్నారు. మొదటిరోజు వర్క్ షాప్ లో భూగర్భ డ్రైనేజి పారిశుధ్య సిబ్బంది 60 మంది, అమినిటి సెక్రటీలు 30 మంది పాల్గొన్నారు.

# దేవతామూర్తుల విగ్రహాలు ధ్వంసం పై ధార్మిక సంఘాల ఆందోళన

విశాఖపట్నం గోపాలపట్నం శివారు ప్రాంతమైన పాత గోపాలపట్నం లో జువ్వలమ్మ ఆలయ ప్రాంగణంలో ఇటీవల జరిగిన విగ్రహాల ధ్వంసంపై ధార్మిక సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ మతానికి ప్రోత్సహిస్తుందనీ, హిందువుల పట్ల చులకన భావన కనిపిస్తుందని ధార్మిక సంఘాల నేతలు ఆరోపించారు. రాష్ట్రంలో విగ్రహాల ధ్వంసం పరిపాటిగా జరుగుతుందని, ఇప్పటికైనా దోషులను శిక్షించాలని, పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ధార్మిక సంఘాలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, బిజెపి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# రైతుబంధు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కి వినతిప్రతం

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు బంధు నిధులు మంజూరు చేసి ..రైతు ఖాతాలో జమ చేయలంటూ వరంగల్ కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు జిల్లా కాంగ్రెస్ నాయకులు?టిపిసిసి ఆదేశాలాల మేరకు హన్మకొండ ఒ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు బంధు నిధులు మంజూరు చేసి రైతు ఖాతాలో జమచేయలంటూ వరంగల్ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో తొలకరి జల్లులు కురిసి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయింది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ లో ఇవ్వాల్సిన పెట్టుబడి సహాయం రైతు బంధు పథకం కింద ఇంకా నిధులు రైతుల ఖాతాలోకి రాలేదు. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతు బంధు సాయం సకాలంలో అందకపోవడంతో జిల్లాలోని రైతాంగం ప్రైవేటు అప్పులపైనే భారం వేసి ఎరువులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.రైతు బంధు సాయం అందకపోవడంతో దళారులు, వివిధ సంస్థల వ్యాపారులు, ముఖ్యంగా ఫెర్టిలైజర్, పెస్టిసైడ్, సీడ్ వ్యాపారులు రైతాంగాన్ని మచ్చిక చేసుకొని కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అప్పుగా ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. వారికి వచ్చే రేట్లలో రెండింతలకు అమ్మకంతో పాటు వాటికి వడ్డీ కలిపి వచ్చే ఏడాది అనగా పత్తి లేదా వరి చేతికొచ్చాక తమకే చెప్పిన ధరలకే విక్రయాలు జరపాలన్న ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.దీంతో రైతులు పండించిన పంటలు దళారికి, వ్యాపారులకు అమ్మితే రైతులకు మిగిలేది ఏమి ఉండదని తెలుస్తోంది

# హౌసింగ్ ఇంజనీర్లు, ఎంపీడీఓ లు సమన్వయంతో పనిచేసి ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలి




కర్నూలు , జూన్ 22: హౌసింగ్ ఇంజనీర్లు, ఎంపీడీఓ లు సమన్వయంతో పనిచేసి ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు ఆదేశించారు..బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఇంజనీర్లు, ఎంపిడిఓ లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోను 44672 ఇళ్లను నిర్మించాల్సి ఉందన్నారు..హౌసింగ్ అధికారులు,ఎంపిడిఓ లు ఇళ్ళ నిర్మాణాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు..వారపు లక్ష్యాలను కచ్చితంగా సాధించి పురోగతి చూపించాలన్నారు.. కర్నూలు బీతీఎజీని, కోసిగి, కౌతాళం మంత్రాలయం, పెద్దకడబూరు, నందవరం, ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు అర్బన్, దేవనకొండ మండలాల్లో పెండింగ్ రిజిస్ట్రేషన్ ఎక్కువగా ఉందని, ఈ ప్రక్రియ ను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆయా మండలాల ఏ ఈ లు, ఎంపిడిఓ లను ఆదేశించారు.. హోళగుంద,గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, గూడూరు, కల్లూరు, వెల్దుర్తి,ఆదోని బీతీఎజీని, ఆలూరు, క్రిష్ణగిరి,చిప్పగిరి,పత్తికొండ మండలాలు వారపు లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నాయని, ఈ మండలాల్లో ఏఈ లు, ఎంపిడిఓ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు.. వచ్చే బుధవారం నాటికి నాట్ స్టార్టెడ్ కింద ఉన్న 691 ఇళ్ల సంఖ్య జీరో కావాలని కలెక్టర్ ఆదేశించారు. నిధులకు కొరత లేదని, పనులు చేయించిన 15 రోజుల్లోపు లబ్ధిదారుల అకౌంట్ల లో బిల్లు లు పడతాయని లబ్ధిదారులకు వివరించాలన్నారు..అప్రోచ్ రోడ్డు జగనన్న కాలనీల్లో అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించి 30 పనులకు గాను 19 పూర్తయ్యాయని, 5 పనులు 75 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు 50 శాతం పూర్తయ్యాయని, వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి చదును కు సంబంధించి నాలుగు పనులు ఉండగా అన్నీ పూర్తయ్యాయని, సిమెంట్ గోడౌన్ లకు సంబంధించి రెండు

### వారపు లక్ష్యాలను కచ్చితంగా సాధించి పురోగతి చూపాలి -:కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు

పనులు 75 శాతం పైనే పూర్తయ్యాయని వీటిని కూడా త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు ఈ పనులకు రూ .1.63 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.ఇప్పటి వరకు 13216 మెట్రిక్ టన్నులు సిమెంట్, 1103 టన్నుల స్టీలు లబ్ధిదారులకు అందచేయడం జరిగిందని, 2105 మెట్రిక్ టన్నులు సిమెంట్, 1340 టన్నుల స్టీలు అందుబాటులో ఉందన్నారు.. ఇసుక సమస్య ఏమైనా ఉంటే జాయింట్ కలెక్టర్ తో మాట్లాడాలని హౌసింగ్ పిడి వెంకట నారాయణ ను ఆదేశించారు..వందకు పైగా ఇళ్లు ఉన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ముందుకు రాని పక్షంలో థర్డ్ ఆప్షన్ కింద ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. గ్రామ సభలు ఏర్పాటు చేసి లబ్దిదారులు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు..ఇప్పటివరకు థర్డ్ ఆప్షన్ కింద ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు వెంటనే బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు..ఓ టి ఎస్ కు సంబంధించి పంచాయతీ సెక్రెటరీ లతో మాట్లాడి రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో జడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య ఈ ఈ లు, డి ఈ లు, ఏ ఈ లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు

# నలందా కళాశాలల అడ్మిషన్ల రద్దు మా పోరాట ఫలితమే:: ఎస్ ఎఫ్ ఐ




కర్నూలు , జూన్ 22:సహకరించినచ ఖీమా శంకర్ నాయక్ సార్ గారికి,చ పత్రిక విలేకరులకు మరియు ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు ప్రత్యేక ధన్యవాదాలుభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పోరాట ఫలితంగానే నంద్యాల పట్టణంలో ఉన్నటువంటి విజయవాడ నలంద జూనియర్ కళాశాల మరియు నలంద జూనియర్ కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ లో రద్దు చేస్తూ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేయడం హర్షించదగ్గ విషయమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు.ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నలంద జూనియర్ కళాశాల మరియు విజయవాడ వారి నలంద జూనియర్ కళాశాల పై ప్రభుత్వ అధికారులు ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని.కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని. హాస్టల్ నిర్వహించడానికి కూడా అనుమతి లేకున్నా, విద్యార్థులను పరిమితికి మించి హాస్టల్ నడుపుతున్నారు, అదేవిధంగా కళాశాలకు కావలసినటువంటి మౌలిక వసతులు మరుగుదొడ్లు లేవని, ఫైర్ సర్టిఫికెట్, మున్సిపల్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ మరియు ఆట స్థలం సౌకర్యం లేవని అనేక దఫాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించడం ద్వారా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు స్పందించి గత సంవత్సరమే కళాశాల కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగింది వాటిపై యాజమాన్యంకి ఎలాంటి స్పందన లేకపోవడం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి కళాశాలకు 2022-23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. సహకరించిన ఆర్ఐఓ శంకర్ నాయక్ సార్ గారికి, పత్రిక విలేకరులకు మరియు ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో మరికొన్ని కళాశాలలు ఉన్నాయి వాటి పైన కూడా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ,తేజ నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

# మురహరి నగర్, రాజీవ్ నగర్ లో మురుగు కాల్వలు ఏర్పాటు పనులకు శంకుస్థాపన

### ముఖ్య అతిథులుగా హాజరైన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బి.వై.రామయ్య, 34వ వార్డు కార్పొరేటర్ వై. వెంకటేశ్వర్లు





కర్నూలు జూన్ 22 -: 34వ వార్డులోని మురహరి నగర్, రాజీవ్ నగర్ లోని పలు మురుగు కాల్వలు ఏర్పాటుకు బుధవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బి.వై.రామయ్య, 34వ వార్డు కార్పొరేటర్ వై. వెంకటేశ్వర్లుతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాల్వలు ఏర్పాటుతో ప్రజలకు మురుగు సమస్యలు ఉండవని, వై.ఎస్.ఆర్.పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సమస్యలు నివారించడంలో ముందు ఉంటుందని నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్.ఆర్.పార్టీ రాష్ట్ర యువ నాయకులు హనుమంత రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎనిమిదవ వార్డులో పైప్లైన్ గుంతలు వెంటనే మరమత్తు చేయాలి చెత్త పన్ను రద్దు చేయాలి.

కర్నూలు , జూన్ 22:సిపిఎం8వ వార్డు సిపిఎం జిల్లా నగర నాయకులు నాయకులు గుణశేఖర్. అబ్దుల్ దేశాయ్. రవిశంకర్ ఇంటింటి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు 8వ వార్డు ఇంటి నెంబర్ 2/55 నుండి 2/80 వరకు పైప్ లైన్ గుంతలు తీసి 45 రోజులైనా మున్సిపల్ అధికారులు చెప్పిన గుంతలకు మరమ్మతు చేయలేదు. అక్కడున్న ప్రజలు పిల్లలు పెద్దలు రాళ్ళలో తిరిగి గాయాల ఐ హాస్పిటల్ పాలవుతున్నారు. వెంటనే గుంతలు మరమత్తు చేయవలెను. ప్రజలు సమస్యలు జగన్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి భవన నిర్మాణ కార్మికులకు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అమలు ఏవి జగన్ వచ్చిన తర్వాత కార్మికులకు వచ్చే డబ్బు రావడం లేదు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక ఆన్లైన్ చేసిన తర్వాత ఇసుక దొరకడం లేదు అలాంటప్పుడు కార్మికులకు ఉపాధి కోల్పోయిన అన్నారు . ఒకవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ మంచి నూనె . కరెంట్ బిల్లులు అమాంతంగా మూడు సంవత్సరాల కాలంలో రెండింతలు పెరిగాయి . ఉద్యోగ ఉపాధి కార్మికులకు వేతనాలు పెరగలేదు. కేంద్ర ప్రభుత్వం మోడీ ఒకవైపు అధిక ధరలు పెంచుతూ హిందూ ముస్లిం ఐక్యంగా ఉన్న వాళ్లకు ఏదో ఒక సమస్య ముందుకు తీసుకొచ్చి వాళ్ల మధ్య చిచ్చుపెట్టి రోజు ఒక ఘర్షణకు దారి చూపుతున్నారు

# పుష్ప 2 కోసం ప్లాన్ ఛేంజ్ చేస్తున్నారా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన క్రేజీ మూవీ 'పుష్ప : ది రైజ్'. స్టార్ డైరెక్టర్ కుమార్ అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్ లో విడుదలై దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాదిలోనూ ఈ మూవీ సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి బాలీవుడ్ లో ఈ మూవీ హాట్ టాపిక గా మారింది. ఎలాంటి ప్రమోషన్స్ లేకుండానే ఉత్తరాదిలో ఈ మూవీ రూ. 100 కోట్ల కు మించి వసూళ్లని రాబట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ఈ మూవీలోని ప్రతీ సాంగ్ ప్రతీ డైలాగ్.. బన్నీ మేనరిజమ్ నేషనల్ వైడ్ గా వైరల్ గా మారాయి. కంటెంట్ విషయంలోనే కాకుండా ఈ మూవీ పబ్లిసిటీ పరంగానూ దేశ వ్యాప్తంగా తగ్గేదేలే అని పిరూపించి ఆశ్చర్యపరిచింది. ఓ సినిమాకు ఈ స్థాయిలో పబ్లిసిటీని చేయోచ్చా?.. ఇంతగా వైరల్ గా మార్చోచ్చా అని అంతా ఆశ్చర్యపోయేలా చేసింది. ఈ నేపథ్యంలో 'పుష్ప 2' ని మరిన్ని ప్రత్యేకతలతో మరింత స్పెషల్ గా తెరపైకి తీసుకురావాలని దర్శకుడు సుకుమార్ గత కొన్ని నెలలుగా స్క్రిప్ట్ పై కుస్తీ పడుతున్నారు.ఇక ఇటీవల విడుదలై వరల్డ్ వైడ్ గా రికార్డు స్థాయి వసూళ్లని దేశ వ్యాప్తంగా కనీ వినీ ఎరుగని సంచలనాలని సృష్టించిన 'కేజీఎఫ్ 2' తరువాత బన్నీ సుకుమార్ ల ప్లాన్ కంప్లీట్ గా మారిపోయింది. బడ్జెట్ నుంచి సినిమాలోని కీలక ఘట్టాల వరకు అన్నింటిని భారీ స్థాయిలో మార్చేశారు. ఈ మూవీ కోసం దాదాపు రూ. 400 కోట్లు కేటాయించబోతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.ఇదిలా వుంటే ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి ఫిల్మ్ సర్కిల్స్ లో చర్కర్లు కొడుతోంది. త్వరలో సెట్స్ పైకి రాబోతున్న ఈ మూవీ షూటింగ్ కోసం చిత్తూరు కర్నూలు పరిసరాల్లో చిత్ర బృందం లొకేషన్స్ ని వెతుకుతోందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. అయితే అందులో ఎలాంటి వాస్తవం లేదని 'కేజీఎఫ్ 2' తరువాత దర్శకుడు సుకుమార్ హీరో బన్నీ ప్లాన్ మొత్తం మార్చేశారని ఈ మూవీ షూటింగ్ ని అత్యధిక భాగం విదేశాల్లో చిత్రీకరించాలని ప్లాన్ చేస్తున్నారట.మరి ముఖ్యంగా సౌత్ ఏషియాలో హంగాకాంగ్ లో ఈ మూవీ షూటింగ్ జరపాలని ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. అంతే కాకుండా నల్లమలలో షూటింగ్ చేయడానికి పరిస్థితులు అనుకూలించని నేపథ్యంలో ఆ సీన్ లని బ్యాంకాక్ ఫారెస్ట్ లో చేయాలని పలు కీలక ఘట్టాలని చిత్రీకరించాలని దర్శకుడు సుకుమార్ ప్లాన్ చేస్తున్నారట.అంతే కాకుండా బన్నీని పార్ట్ 2 లో గంధపు చెక్కల స్లగ్లింగ్ కి కింగ్ పిన్ గా మార్చి ఇంటర్నేషనల్ డాన్ గా చూపించబోతున్నారట. అందులో భాగంగానే సుకుమార్ ఈ మార్పులకు శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తోంది. అంతే కాకుండా చైనా జపాన్ వంటి దేశాల్లోనూ కీలక సన్నివేశాలని రూపొందించాలని ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

# పాకిస్థాన్ రెస్టారెంట్ ముందు అలియా భట్

ఆర్.ఆర్.ఆర్ సినిమా ద్వారా తన స్థాయిని మరో రేంజ్ కు పెంచుకున్న ఆలియాభట్ అంతకు ముందు వచ్చిన గంగుభాయ్ ఖతీయవాడి సినిమాతో కూడా మంచి సక్సెస్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలో మొదటిసారి ఒక వేశ్య పాత్రలో కనిపించింది. ముంబై రెడ్ లైట్ ఏరియాకు చెందిన



రియల్ లైఫ్ క్యారెక్టర్ గంగుభాయ్ పాత్రలో ఆమె నటించిన విధానం విమర్శకుల ప్రశంసలను అందుకుంది.అయితే ఆ సినిమాలోని ఒక సన్నివేశాన్ని ఉపయోగించుకుని ఇటీవల పాకిస్తాన్ రెస్టారెంట్ డిజైన్ చేసిన యాడ్ పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఆ కమర్షియల్ ప్రకటనపై ట్రోల్స్ కూడా మొదలయ్యాయి. గంగుభాయ్ ఖతీయవాడి సినిమాలో ఒక సన్నివేశంలో అలియా భట్ తన రూమ్ బయట నిలబడి వేశ్యగా దారిన పోయే వారిని పిలుచుకుంటూ ఉంటుంది.ఆ సన్నివేశం మొత్తం సినిమా లోనే చాలా హైలెట్ గా నిలిచింది. అంతే కాకుండా చాలా ఎమోషనల్ గా కూడా అనిపించింది అని కొంతమంది సినీ ప్రముఖులు స్పందించారు.వేశ్య పాత్రను చాలా ఎమోషనల్ గా హైలెట్ చేసిన అలియా క్రిటిక్స్ నుంచి కూడా పాజిటివ్ కామెంట్స్ అందుకుంది. అయితే అలాంటి సన్నివేశాన్ని ఉపయోగించుకుని ఇటీవల పాకిస్థాన్ కు చెందిన ఓ రెస్టారెంట్ ఒక ఆఫర్ ను ప్రకటిస్తూ ఆలియా భట్ ను హైలెట్ చేశారు.సోమవారం రోజు పురుషులకు ప్రత్యేకంగా ఆఫర్ ఉంది అంటూ అలియా పిలుస్తున్నట్లు గా ఆ కమర్షియల్ యాడ్ ను చూపించారు. దీంతో ఇలాంటి పిచ్చి పనులు తప్ప మరో ఆలోచనలు రావా అని నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆ రెస్టారెంట్ యాజమాన్యం పై విరుచుకుపడుతున్నారు.మరోసారి మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు అంటూ.. ఈ విషయంలో మీకు తప్పకుండా సలహాలు కావాలి అంటే సోషల్ మీడియా లో చాలామంది ఉన్నారు అని చివాట్లు పెడుతున్నారు. ఇక అందుకు సంబంధించిన వీడియో అయితే ప్రస్తుతం ఇంటర్నెట్ ప్రపంచంలో వైరల్ గా మారుతోంది.

# బాలయ్య సినిమాలో ఒరిజినల్ రాజశేఖర్?

విభిన్నమైన కామెడీ ఎంటర్టైనర్ సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అనుకున్న అనిల్ రావిపూడి తదుపరి సినిమాను నందమూరి బాలకృష్ణ తో చేయబోతున్న విషయం తెలిసిందే. అసలైతే కెరీర్ మొదట్లోనే బాలయ్య బాబు తో సినిమా చేయాలని ఈ దర్శకుడు చాలా ప్రయత్నాలు చేసాడు. కానీ ఊహించని విధంగా ఆ ప్రణాళికలు అన్నీ కూడా వృధా అయిపోయాయి. బాలయ్య బాబు కూడా



అప్పుడు చాలా బిజీగా ఉండడంతో అనిల్ రావిపూడి తో సినిమా చేయలేకపోయాడు.ఇక ఇప్పుడు అతను మంచి సక్సెస్ ట్రాక్లో ఉండడంతో మిగతా కథలను పక్కన పెట్టి మరి అనిల్ తో సినిమా చేసేందుకు బాలయ్య సిగ్నల్ ఇచ్చాడు. ప్రస్తుతం బాలయ్య గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇక ఆ సినిమా అయిపోగానే నందమూరి బాలకృష్ణ జులై ఫస్ట్ వీక్ నుంచి అనిల్ రావిపూడి దర్శకత్వం లో కొత్త సినిమా స్టార్ట్ చేయడానికి రెడీ కానున్నాడు.అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అంశం ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా వైరల్ గా మారుతోంది. అదేమిటంటే ఈ సినిమాలో సీనియర్ నటుడు రాజశేఖర్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపిస్తాడని సమాచారం.బాలయ్య బాబు ఈ సినిమాలో 45 ఏళ్ల పైబడిన ఒక వ్యక్తిగా అలాగే ఒక 18 ఏళ్ళ కూతురికి తండ్రిగా కూడా కనిపించబోతున్నాడు. అయితే ఆయనకు మంచి స్నేహితుడిగా ఒక కామెడీ పాత్రలు రాజశేఖర్ ను తీసుకోబోతున్నట్లు సమాచారం.సాధారణంగా రాజశేఖర్ ఏ సినిమా చేసినా కూడా ఆయన వాయిస్ కు సాయికుమార్ డబ్బింగ్ చెబుతూ వస్తున్నారు. కానీ అనిల్ రావిపూడి మాత్రం రాజశేఖర్ ఒరిజినల్ వాయిస్ తోనే మ్యాజిక్ క్రియేట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.ప్రస్తుతం ఈ ప్లాన్ అయితే చర్చల దశలోనే ఉన్నట్లుగా తెలుస్తోంది. బాలయ్యబాబు అలాగే రాజశేఖర్ తో కూడా మరొకసారి చర్చలు జరిపిన అనంతరం అనిల్ రావిపూడి ఈ ప్లాన్ తో ముందుకు వెళ్లే అవకాశం ఉందట. ఒకవేళ అదే నిజమైతే రాజశేఖర్ పాత్ర భిన్నంగా హైలెట్ అవుతుందని చెప్పవచ్చు.

# టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బే ఇది! అతడు లేడు కాబట్టి... రోహిత్‌పై మరింత భారం!



ఇంగ్లండ్‌తో రీషెడ్యూల్డ్ టెస్టు నేపథ్యంలో టీమిండియా కేఎల్ రాహుల్ సేవలను కోల్పోవడం పెద్ద ఎదురుదెబ్బేనని భారత మాజీ క్రికెటర్, మాజీ సెలక్టర్ సబా కరీం అన్నాడు. గతేడాది ఈ కర్ణాటక బ్యాటర్ ఇంగ్లండ్ గడ్డ మీద మంచి స్కోరు నమోదు చేశాడని కొనియాడాడు. అలాంటి మేటి ఆటగాడు ఇప్పుడు జట్టుకు దూరం కావడం తీరని లోటు అని పేర్కొన్నాడు.ఈ క్రమంలో కెప్టెన్ రోహిత్ శర్మపై మరింత ఒత్తిడి పెరుగుతుందని, ఓపెనర్‌గా మరింత మెరుగ్గా రాణించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డాడు. కాగా విరాట్ కోహ్లి సారథ్యంలోని భారత జట్టు గతేడాది ఆగస్టులో ఇంగ్లండ్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మొదటి టెస్టు డ్రా కాగా.. రెండో టెస్టులో కేఎల్ రాహుల్ సెంచరీ(129)తో చెలరేగడంతో కోహ్లి సేన విజయం సాధించింది. ఇక మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 76 పరుగులతో విజయం సాధించగా.. నాలుగో టెస్టులో రోహిత్ శర్మ అద్భుత శతక ఇన్నింగ్స్(127) కారణంగా ఆతిథ్య జట్టుపై గెలుపొంది టీమిండియా 2-1 ఆధిక్యం సాధించింది. అయితే, కోవిడ్ కారణంగా ఐదో టెస్టు నిరవధికంగా వాయిదా పడగా.. ఈ ఏడాది జూలై 1న రీషెడ్యూల్ చేశారు.అప్పటికి ఇప్పటికి పరిస్థితులు మారాయి. ఇంగ్లండ్‌తో సిరీస్ తర్వాత దక్షిణాఫ్రికాలో ఎదురైన పరాభవం నేపథ్యంలో విరాట్ కోహ్లి కెప్టెన్సీకి గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రోహిత్ శర్మ ప్రస్తుత మ్యాచ్ నుంచి టీమిండియా టెస్టు జట్టు సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక ఈ సిరీస్‌లో భారత్ నమోదు చేసిన విజయాల్లో ఓపెనర్లు రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్‌ది కీలక పాత్ర అనడంలో సందేహం లేదు.ఈ నేపథ్యంలో సబా కరీం మాట్లాడుతూ.. "ఈ కీలక సమయంలో భారత్ స్టార్ ఆటగాడి సేవలను కోల్పోయింది. కేఎల్ రాహుల్ లేకపోవడం పెద్ద లోటు. గతేడాది టీమిండియా ఇంగ్లండ్ మీద గెలిచిన రెండు మ్యాచ్‌లలో అతడు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. గెలుపులో తన వంతు సహాయం చేశాడు. కాబట్టి ఈసారి అతడి సేవలను భారత జట్టు తప్పకుండా మిస్సవుతుంది'' అని అభిప్రాయపడ్డాడు. రాహుల్ స్థానంలో శుబ్‌మన్ గిల్ రోహిత్‌తో ఓపెనింగ్ చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశాడు. ఇక రోహిత్ శర్మ గురించి ప్రస్తావిస్తూ.. "రాహుల్ గైర్హాజరీతో రోహిత్‌కు బాధ్యత రెట్టింపు అయింది. గతేడాది అతడు రాహుల్‌తో కలిసి భారత్‌కు శుభారంభాలు అందించాడు. ఈసారి కూడా అదే స్థాయిలో రాణించాల్సి ఉంది. ఓపెనింగ్ జోడి బ్యాట్ ఝులిపిస్తేనే టీమిండియా మంచి స్కోరు నమోదు చేయగలదు" అని సబా కరీం ఇండియా న్యూస్‌తో తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు.కాగా ఈ సిరీస్‌లో రాహుల్ 39.37 సగటుతో 315 పరుగులు చేయగా.. రోహిత్ శర్మ 368 పరుగులతో అత్యధిక స్కోరు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇక జూలై 1 నుంచి ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఐదో టెస్టు జరుగనుంది. ఇందుకోసం ఇప్పటికే ఇంగ్లండ్ చేరుకున్న భారత జట్టు ప్రాక్టీసులో తలమునకలైంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190